# పాలపొంగు

---

ఇంట్లో కాలు పెడుతూనే "అమ్మా! అమ్మా!" అంటూ కేక వేశాడు మూర్తి.

ఆ కేకకి అదిరిపడి వంటింట్లో ఉన్న తల్లి ఒక్క పరుగున ఈవలి కొచ్చింది "ఏవిట్రా?- ఏవిట్రా?" అంటూ. కాని కొడుకు నవ్వు మొహం చూసి మనస్సు కుదుట పడ్డది. "అగావుకేక లేయకపోతే ఏం నాయనా?" అంది,

అది వినిపించుకోకుండానే కొడుకు, "అమ్మా! యివ్వాళేం జరిగిందనుకున్నావ్?" అన్నాడు.

"ఆ?"— అదుర్దా హెచ్చింది తల్లికి.

"అయ్యో నీకింకా తెలీదూ? వూళ్ళో అంతా గోలగా వుంటేనూ!"

"ఏమిటేమిటి?"— ఆమె కళ్లు మరీ పెద్దవైనై.

"ఇవ్వాళ హర్తాళ్ అమ్మా! వూళ్ళో దుకాణాలన్నీ మూసేశారు. స్కూళ్ళన్నీ బంద్."

"ఏం?"

"స్ట్రయిక్ చేశాం."

"ఎందుకూ?"

"నీకింకా తెలీనేలేదా? గాంధీజీ అరెస్టయాడమ్మా!"

"అయితే?"

మూర్తి ఒక్కసారి చప్పబడ్డాడు! "అంతేనా? కాంగ్రెసు నాయకు లంతా అరెస్టయారమ్మా!"

"మరి మీరు స్ట్రయిక్ చేయటం దేనికిరా?"

బావుంది! దేశ నాయకులంతా జైలుకు పోతూంటే మేము స్ట్రయిక్ చేయటం దేనికట! ఏమేనా అర్థం వుందీ? తల్లి అమాయకత, అవివేకం చూసి మూర్తికి ఆశ్చర్యం, కోపం, జాలీకూడ ఒక్కసారి పుట్టుకొచ్చాయి. ఈ తల్లి కొడుకునేనా నేను?

"వాళ్ళంతా జైలుకు పోవటం మీకు సంతోషమేం(వి)ట్రా?"

"ఎవరన్నారు?"

"మరి మీరు పాఠాలు ఎగ్గొట్టడం దేనికి?"

ఎంత అవివేకం! ఇవాళ స్ట్రయిక్ జేయటం పాఠాలు ఎగ్గొట్టడానికా?

"అబ్బ! నీకు తెలీదులేవే వూరుకో." అన్నాడు మొహం చిట్లించు కుంటూ. "అసలు సంగతి వినవేం. ఇవాళ మా స్కూల్లో బలే గమ్మత్తు

జరిగింది"— మళ్ళీ వుత్సాహాన్ని తెచ్చుకుంటూ అన్నాడు.

"మరి తొందరగా కానీ. అవల నాకు పని వుంది "

"వంటే కదూ! అబ్బ! నీకెప్పుడూ వంటేనే. వాళ్ళకు వాళ్లు తగలబడిపోతున్నా! నీ వంటే వంట!"

కొడుకు చీకాక్కి తల్లికి నవ్వొచ్చింది. "వెఱ్ఱి నాన్నా! అదుంటేనే అన్నీనోయ్."

"ఏమిట్రా అన్నయ్యా! ఏం చెబుతున్నావ్?" అంటూ పరుగెత్తు కొచ్చింది ఎనిమిదేళ్ళ ఇందు. ఆ వెనకాలే అయిదేళ్ళ సూర్యం "నాకూ చెప్పాలి... నాకూ చెప్పాలి," అంటూ వచ్చాడు.

"అబ్బ వుండండ్రా మీ గోలేమిటీ." అంటూ "కూర్చోవే అమ్మా," అని తల్లిని కుర్చీలో కూలేసి అందుకొన్నాడు.

"ప్రొద్దున స్కూలు కెళ్ళానా అమ్మా! త్రోవలోనే తెలిసిందే అరెస్టుల సంగతి. దుకాణాలన్నీ మూసినవి మూసినట్టుగానే వుండిపోయినై. స్కూలు పిల్లలంతా "ఇవ్వాళ వెళ్ళొద్దు వెళ్ళొద్దు," అంటూ కోడ్లంబడి తిరగటం మొదలెట్టారు. నన్నూ ఆపారు. కాని మా స్కూలు సంగతి ఎలా వుందో తెలుసుకొందామని వాళ్ళనంతా తప్పించుకొని వెళ్ళాను. స్కూలు చేరగానే పిల్లలంతా గుంపులు గుంపులుగా వుంటం చూసి నాకెక్కడ లేని సంతోషం కలిగింది. అప్పటికింకా బెల్లు కాలా. నేను వెళ్ళగానే నా చేతిలో ఒక కాగితం పెట్టి సంతకం చెయ్యమన్నారు. మారు మాట్లాడకుండా ముందు సంతకం పెట్టి, తర్వాత చదివాను. ఇవ్వాళ ఒక్కరోజు కోసం బడి మూసేయించమని హెడ్‌మాస్టర్ని కోరారు అందులో. అంతే. ఇంతలోకి హెడ్‌మాస్టరు కూడ వచ్చాడు. వచ్చీ రావటమే మమ్మల్ని చూసి వుగ్రుడై పోయాడు. "ఇక్కడేం చేస్తున్నారు? క్లాసులోకి పోరేం?" అంటూ గదమాయించాడు. దాంతో ఇందాక ఎంతో ధైర్యంతో మాట్లాడు

లూన్న పిల్లలంతా ఒక్కసారి పిల్లికూనలైనారు. ఎవరిమటుకు వారు జారు కోటం మొదలెట్టారు హెడ్‌మాస్టరుకూడా ఆఫీసులోకి వెళ్ళిపోయాడు. వెనకాలే మా మానీటరూ, ఇంకో అబ్బాయీ అప్లికేషన్ తీసికొని వెళ్ళారు. దాంతో అతను మరీ వుగ్రుడైపోయి, ఆ అప్లికేషన్ పూరిగా చదవ కుండానే చించి పారేసి నానా చీవాట్లూ పెట్టాట. తనూ వెంటనే ఓ బెత్తం పుచ్చుకొని బయలుదేరే సరికి ఎక్కడివారక్కడ క్లాసుల్లోకి మాయమ య్యారు. నేనూ క్లాసులోకి వెళ్ళిపోయా. హెడ్‌మాస్టరు ఒక్కొక్క క్లాసే తిరుగుతూ, "ఇలాంటి ఆటలు తన దగ్గర సాగవనీ. ఎవరేనా తనకెదురు తిరిగారా వెంటనే స్కూలు నించి డిస్మిస్ చేయటమే కాకుండా పోలీసు వాళ్ళచేత బాగా తన్నిస్తాననీ" అంటూ మహా దూకుడుగా లెక్చర్లు దంచటం మొదలెట్టాడు. దాంతో మాకు చెడ్డ వుద్రేకం కలిగినా ఏమీ చేయలేక ఒకరి మొహాలొకరం చూసుకుంటూ వూరకున్నాం. అతను వెళ్ళిపోగానే మళ్ళీ గుసగుసలు బయలుదేరినై. అవి కాస్తా పెరిగి చర్చల్లోకి దిగినై. మాస్టర్లు వేడుకొన్నారు, బెదిరించారు, రిపోర్టు చేస్తామన్నారు. కాని ఎవరు వింటారూ? ఇంతలో రిపోర్టుల మీద రిపోర్టులు వస్తునై— అన్ని స్కూళ్ళూ, కాలేజీల పిల్లలంతా కలిసి ఒక్కొక్క స్కూలే తిరుగు తున్నారనీ, ఇక్కడికీ ఇహ వస్తారనీ. ఇది వినగానే మాకు ఎక్కడలేని వుత్సాహం పుట్టుకొచ్చింది? హెడ్‌మాస్టరుక్కూడ ఈ సంగతి తెలిసింది గామాల్ను. వెంటనే స్కూలు గేటు మూయించి తాళం వేయిచాడు. ఈ సంగతి తెలియగానే మాకు మరీ మండుకొచ్చింది, నిజంగా అమ్మా! అప్పుడు మేమంతా శత్రుకోటలో బంధింపబడి వున్న ఖైదీల్లాగానూ, ఆ వచ్చే సోదర విద్యార్థులు ఈ కోటను ముట్టడించి మమ్మల్ని విడిపించుకు పోయే మిత్ర సైన్యము లాగాను అనిపించిందంటే నమ్మ. ఎప్పుడెప్పుడా అని కూర్చున్నాం. క్షణం గడవటం కష్టమై పోయింది. మాలో కొంత మంది చెట్లెక్కి కూర్చున్నారు వాళ్ళ రాక కెదురు చూస్తూ. గేటు దగ్గరా, వరండాలోనూ మేస్టర్లూ, ప్యూన్లూ కాపలా కాస్తున్నారు హెడ్‌మాస్టరు ఆజ్ఞ ప్రకారం. ఇంతలోకి, "వస్తున్నారు!...వస్తున్నారని," అంటూ కేక

లేశారు చెట్లపైన వున్నవాళ్లు. అప్పుడే స్కూలు కాంపౌండ్ అవల్నించి "గాంధీకీ జై! కాంగ్రెసుకీ జై!" అన్న అరుపులు వినిపించాయి. దాంతో లోపలవున్న మా వుద్రేకము కట్టలు తెగి ప్రవహించింది. ప్రతి కంఠం ఎలుగెత్తి అరిచింది. "గాంధీకీ జై! కాంగ్రెస్‌కీ జై!" అని క్లాసుల్లో ఒక్కరూ వుండకుండా గేటువైపు పరుగెత్తారు. మేస్టర్లు ఏమీ చేయలేక చూస్తూ నిలుచుండి పోయారు. ప్యూన్‌లకి ధైర్యమాగక మూలలకి నక్కారు. ఒక్క హెడ్‌మాస్టర్ మాత్రం చేత బెత్తంతో కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతూ మేస్టర్లనీ, ప్యూనన్నీ, పిల్లల్నీ తిడుతూ, చేతికందిన వాడినల్లా బెత్తంతో బాత్తున్నాడు. నేను గేటు దగ్గరకు వెళ్లే సరికి ఓ పిల్లవాడు తాళం విరక్కొట్టానికి చూస్తున్నాడు. హెడ్‌మాస్టరు తన కసికొద్దీ ఆ పిల్లాడి వీపుమీద బెత్తంతో బాత్తున్నాడు. అయినా ఆ అబ్బాయి చలించకుండా తన పని తను చేస్తూనే వున్నాడు. అమ్మా ఆ దృశ్యం యిప్పటికీ కళ్ళకు కట్టినట్టున్నది. అందరూ భయాశ్చర్యాలతో చూస్తూ నిలుచున్నారు. ఒక్కరికీ ధైర్యమాగలా. ఆ దృశ్యం చూసేసరికి నా కళ్ళల్లో నెత్తురు చిమికింది. నన్ను నేనే మరిచిపోయా. ఒక్క దూకులో వెళ్ళి హెడ్‌మాస్టర్‌ని తోసేసి ఆయన చేతిలోంచి బెత్తం లాక్కుని దాన్ని తునాతునకలు చేసిపారేశా. నా కసంతా దాని పైనే తీరుస్తూ నేను ముందంజ వేయగానే అందరిలోనూ ఒక్కసారి చలనం కలిగింది. కాని అది కనిపెట్టి హెడ్‌మాస్టరు వెంటనే ఆఫీసులోకి పరుగుతీసి, లోపల్నించి గడియ వేసికొన్నాడు. ఇంతలోకి గేటుతాళం వూడతీశారు. అవలున్న జనప్రవాహమంతా ఒక్కసారి లోపలికి కొట్టుకొచ్చింది. అంతా కలిసి జై జై నినాదాలుచేస్తూ ఆఫీసుకేసి పరుగెత్తారు. ఒక్క తన్నుకి తలుపు వూడిపడ్డది. లోపల ఫోన్‌దగ్గర వున్నాడు హెడ్‌మాస్టర్. వెళ్ళి కాలర్‌పట్టుకు ఇవతలికి లాక్కొచ్చారు. అతని మొహం చూడగానే నాకోపం మరీహెచ్చింది. నా బలం కొద్దీ ఒక్క లెంపకాయ వేయాలని చేయెత్తాను. కాని నాచేయినెవరో అట్టానే పట్టుకొన్నారు. వెనక్కు తిరిగిచూస్తే ఓ ఖద్దర్ యువకుడు కనిపించాడు

వొద్దని నన్ను వారిస్తూ. "అమ్మా! అతనెంతమంచి వాడనుకున్నావ్! పేరు అబ్దుల్లాట; లాకాలేజీ విద్యార్థట. పఠానబ్బాయిలాగున్నాడు— అతను ముందుకొచ్చి హెడ్ మాస్టర్ చేయిపట్టుకోగానే గజగజ వణికిపోయాడు. "హెడ్‌మాస్టర్‌ను కొట్టండి, తన్నండి" అన్న గోల మరీ ఎక్కువైంది. కాని అబ్దుల్లా చేయెత్తగానే అంతటా నిశ్శబ్దం! అతనే మాకంతా నాయకుడని నేనప్పుడే తెలుసుకున్నాను.

"ఆ అబ్బాయి నెందుకల్లా కొట్టావ్?" అని శాంతంగానే అడిగాడు అబ్దుల్లా. హెడ్‌మాస్టర్ నోటమాట రాలేదు. "ఆ అబ్బాయిని క్షమాపణ వేడుకో" అన్నాడు 'హుకుం' ఇస్తూన్నట్టుగా అబ్దుల్లా. దానికి హెడ్ మాస్టర్ తటపటాయించడం మొదలెట్టాడు. "ఊఁ కానీవేం?... నేనింకెప్పుడూ అల్లా చెయ్యనని చెంపలు వేసుకో." అని గర్జించాడు అబ్దుల్లా. "వేసుకున్నాడా?" అంది తల్లి అదుర్దాగా.

"ఆ, వేసుకోక గత్యంతరం వుందీ? తర్వాత మూడుసార్లు, "గాంధీకీ జై! కాంగ్రెస్‌కీ జై!" అనమని ఆజ్ఞాపించాడు అబ్దుల్లా."

"అన్నాడా?" అంది తల్లి కళ్లు పెద్దవిచేస్తూ.

"ఆ, అనకపోతే వూరుకుంటామా? అన్నాకే మరి వదలిపెట్టి ఈవలకొచ్చేశాం."

తల్లి వొళ్ళో కూచున్న సూర్యం, "గాంధీకీ జై! గాంధీకీ జై!" అంటూ చప్పట్లు చరవటం మొదలెట్టాడు.

"మీది మరీ దౌర్జన్యంరా అబ్బాయి," అంది తల్లి.

"ఏమిటే దౌర్జన్యం?"

"మీ రాయన్నట్టా ఏడిపిస్తారూ?"

"ఆ కుర్రాణ్ణటా కొడ్తాడూ? అది దౌర్జన్యం కాదా?"

"ఎంతైనా వాళ్ళు పెద్దవాళ్ళు, మీరు చిన్నవాళ్ళు."

"అమ్మా! పెద్దవాళ్ళు పెత్తనం నిలబెట్టుకోనప్పుడు చిన్నవాళ్ళు చిన్నతనం మీరితే అది చిన్నవాళ్ళ తప్పేనా? మేము పొద్దున సవినయంగా అడిగినప్పుడు స్కూలు మూసేసి వుంటేయేం?"

"ఏమోరా అబ్బాయ్! మీ పోకళ్లు నాకేం అర్థంకావు... సరేగాని కాఫీ తాగుతావా ?"

"ఆ మరందుకేగా వచ్చిందీ? ఏమైనా ఫలహారంకూడా వుంటే పెటవే ఆకలేసుందీ మధ్యాహ్నం హోటల్‌కికూడ వెళ్ళలేకపోయాను... ఊఁ, త్వరగా."

"ఇంకా ఎక్కడికేనా వెళ్ళాలా యేం?"

"అయ్యో తిన్నగా అడుగుతున్నావూ, ఇప్పుడు పార్కులో పెద్ద మీటింగు జరుగబోతుంటేనూ। విద్యార్థి బృందమంతా ఈపాటికి చేరే వుంటుంది. మహాగొప్ప సభ అమ్మా! అబ్దుల్లా. శర్మ. నరేందర్, సావిత్రీ యింకా ఎంతోమంది లెక్చర్లిసారటమ్మా! నేనెన్నడూ వాళ్ళని చూడనేలేదే..."

"కాని మీ నాన్నగారు వచ్చేవేళ అయిందిగా?"

"వస్తే యేం?" అన్నాడు ధీమాగా మూర్తి.

"ఒరే మూర్తీ !"

మూర్తి వళ్లు ఝల్లుమంది! తండ్రి కంఠంలో అంత కఠినత్వం వుందని తానెన్నడూ అనుకోలేదు.

తల్లీ, కొడుకూ ఒకరి మొహాలు ఒకరు చూస్తూ నిలబడిపోయారు...

ఇంతసేపూ నిశ్శబ్దంగా వింటూన్న ఇందు, "నాన్నోయ్! ఏం జరిగిందంటేనూ..." అంటూ లేచింది.

"ఓసే నీకెందుకే?" అంటూ ఆపబోయింది తల్లి.

కాని తల్లిమాట విని చచ్చారూ ఎవరేనా? "నాన్నోయ్ ఇవ్వాళ అన్నయ్య బళ్ళోనే..." అంటూ నాన్న దగ్గరికి పరుగెత్తింది. కాని "ఛీ, పో." అన్న గదమాయింపు వినబడగానే అమ్మగారి దిమ్మ తిరిగింది. మధ్య తానేం నేరం చేసిందో అర్థంకాక కళ్ళలో నీళ్ళు గుక్కుకుంటూ మెల్లగా జారుకుంది. సూర్యం చంకదిగి, "నాన్నోయ్! గాంధీకీ జై! నాన్నోయ్ గాంధీకీ జై!" అంటూ తండ్రి దగ్గరకెళ్ళి గంతులెయ్యటం మొదలెట్టాడు. కాని ఫెళ్ళుమని చెంపవాగ్గానే బావురుమని రాగం తీశాడు. తల్లి వెళ్ళి కొడుకు నెత్తుకుని— భర్త నిప్పుడేమన్నా ప్రమాదమేనని గ్రహించుకుని— బుజ్జగించటం మొదలెట్టింది. ఇదంతా గమనిస్తూన్న మూర్తికి హడలెత్తిపోయింది.

నాన్నకంతా తెలిసిపోయిందా?

"ఒరే, రావేం?" అన్న గర్జన వినబడగానే గుండె గుభేలుమంది. ముందుకు సాగలేక అడుగులో అడుగు వేసుకుంటూ, వెనక్కి తిరిగి తల్లికేసి దీనంగాచూస్తూ వెళ్ళి తండ్రి ఎదుట తలవంచుకునినిలుచున్నాడు.

తండ్రి అసహ్యాన్నీ, కోపాన్నీ వెలిగ్రక్కే దృక్కుల్తో కొడుకుని ఎగాదిగా చూసి "వెధవా" అన్నాడు. తన చేతిలో వున్న వుత్తరం అందిస్తూ 'చూడు' అన్నాడు అధికార స్వరంతో. భయపడూ భయపడూ, వణికే చేతుల్తో ఆ వుత్తరం అందుకున్నాడు మూర్తి. అది హెడ్‌మాస్టర్ తన తండ్రికి రాసిన వుత్తరం. అందులో తానారోజు చేసినవన్నీ ఒకటికి నాలుగు పెంచి రాస్తూ "మీ మొహంచూసి వూరుకున్నాను. లేకుంటే ఈ పాటికి మూడేండ్లవరకు రెస్టిక్రేట్ చేయించేసి వుందును. ఇప్పటికైనా వెంటనే అపాలజీ రాకపోతే రిపోర్ట్ చేయక తప్పదు." అని వుంది. వళ్ళు మండింది మూర్తికి. వెళ్ళి హెడ్‌మాస్టర్ని చావతన్నాలని బుద్ధి పుట్టింది. కాని ఎదుట తండ్రి వుగ్రస్వరూపం కనిపించగానే కోపమంతా నీరైపోయింది. "కూర్చో," అన్నాడు తండ్రి కఠినంగానే. కూర్చు న్నాడు. డెస్కులోంచి రైటింగ్ ప్యాడ్ తీసి మూర్తి ముందుకు విసరి, "ఊ, రాయి," అన్నాడు తండ్రి. ఏమిటి? అపాలజీయే? ముచ్చెమట్లు

కమ్మాండ్ మూర్తికి. ఒక్కసారి ఉరుకు పుట్టుకొచ్చింది. "కాని నాన్న..." అంటూ ఏదో సంజాయిషీ ఇచ్చుకోబోయాడు.

తండ్రి గుడ్లెఱ్ఱజేస్తూ "ఛీ నోరుముయ్. ఇంకా మాట్లాడుతున్నావ్ నోరెట్టుకుని! నేను చెప్పినట్లుగా రాయి." అన్నాడు. తలవంచేసుకున్నాడు మూర్తి. ఏమిటీ అన్యాయం? విచారణ లేకుండానే శిక్ష?— ఇంగ్లీషు వాళ్ళకుమల్లేనే! ఎదురు తిరగమని కోరింది హృదయం. సాహసించవద్దని హెచ్చరించింది బుద్ధి. మారు మాట్లాడకుండా రాస్తున్నాడు... తాను చేసిన పనికి విచారిస్తున్నాననీ, ఇక ఎప్పుడూ అలా చెయ్యననీ, చేస్తే మీ యిష్టం వచ్చిన శిక్ష విధించవచ్చుననీ, ఇప్పుడు ఒహసారి మాత్రం క్షమించవలసిందనీ, అల్పశిక్షేదైనా ఇస్తే స్వీకరిస్తాననీ వేడుకుంటూన్నట్టు రాస్తున్నాడు...కలాన్ని తన రక్తనాళాల్లో ముంచి, తన హృదయ ఫలకంమీద ఒక్కొక్క అక్షరమే చెక్కుతూన్నట్లుగా బాధపడుతూన్నాడు మూర్తి. ఇది క్షమాపణ పత్రమేనా? తానేనా రాసేది? కాదని ఎట్లా అనుకోటం, కళ్ళారా చూస్తూనే? రేపు తానే మొహం పెట్టుకు తిరుగుతాడు? తోడి విద్యార్థులకు అపాలజీ సంగతి తెలిశాక తానిక బ్రతగ్గలడా?...... ఛీ! ఏం బ్రతుకీ పాడు బ్రతుకు?... ఈ కలం విరిగిపోదేం? కాగితం చిరిగిపోదేం?... తానింకా బ్రతికేవున్నాడేం?...... కలాన్ని విసిరి తండ్రి మొహాన కొట్టి, కాగితం చించిపారేసి పెద్దపెట్టున యేడవాలనిపించింది! ...కాని అదేమీ జరక్కుండానే పత్రం పూర్తైంది.

సంతకం పెట్టబోయేముందు మళ్ళీ ఒక్కసారి కోపం వొచ్చింది కాని, ఆ పొంగు వెంటనే చల్లారింది కూడాను. రెక్కల్లేని పక్షిలా రెపరెపలాడి వూరుకుంది హృదయం.

వణికే చేత్తో, తనకే కొత్తగా కనిపించే అక్షరాల్తో గబగబా సంతకం గీకేసి, ఇహ అక్కడొక్క క్షణంకూడా నిలవలేక తన గదిలోకి పరుగెత్తుకెళ్ళి మంచంపైన దభాలున పడిపోయాడు, వెక్కివెక్కి ఏడుస్తూ. కోపం, అసహాయతా కలిస్తే, దుఃఖమేగా ఫలితం!